యువతులను ఎరగా వేసి..

(3వ పేజీ తరువాయి): పోలీసులు అవాక్కయ్యారు. మద్యం సీసాలతో యువతులు అసభ్యకరరీతిలో నృత్యాలు చేస్తుండగా, వినియోగదారులు అస్వాదిస్తూ మద్యం తాగుతున్నారు. చెవులు చిల్లులు పడే శబ్దం డీజే పాటలు మారుమోగిపోతున్నాయి. పోలీసులు పబ్‌ను చుట్టుముట్టి 32 మంది యువతులను, 131 మంది పురుషులను, ఐదుగురు బౌన్సర్లను, సిబ్బందిని అదుపులోకితీసుకున్నారు. పబ్ యజమాని వెంకట్రావు అలియాస్ రాముతో పాటు మరికొంత మంది పరారీలో ఉన్నారు. నిందితులపై బంజారాహిల్స్ పోలీసులు వివిధ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీ నుంచి బ్రోకర్ ద్వారా యువతులు

ఆఫ్టర్ 9 పబ్‌కు ఏపీకి చెందిన ఓ బ్రోకర్ ద్వారా యువతులను తరలిస్తున్నట్టు తెలిసింది. ప్రతీ పదిహేను రోజులకోసారి వీరిని మార్చేలా నిర్వాహకులు బ్రోకర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్టు సమాచారం.



బీజేపీ 'అగ్ర' తాంబూలం

(3వ పేజీ తరువాయి)

తమిళి సై సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించారు.

అభ్యర్థులకు వెన్నుదన్నుగా

నామినేషన్ల సమయంలో పలువురు కేంద్రమంత్రులు వచ్చి అభ్యర్థులకు వెన్నుదన్నుగా నిలిచారు. సికింద్రాబాద్ అభ్యర్థి కిషన్‌రెడ్డి నామినేషన్ సమయంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ర్యాలీలో పాల్గొన్నారు. మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా కేంద్రమంత్రి హరిదీప్ సింగ్ పూరి, హైదరాబాద్ అభ్యర్థి మాధవీలత కొంపెల్ల నామినేషన్ సమయంలో కేంద్ర మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ వచ్చారు. ఉత్తర భారతదేశానికి చెందిన వారు ఇక్కడ ఎక్కువ మంది ఉండడంతో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కిషన్‌రెడ్డి సమావేశాలు నిర్వహించి మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేశారు. కంటోన్మెంట్‌లోని మాజీ సైనికులతో సమావేశమయ్యారు. మల్కాజిగిరిలో తమిళులు ఎక్కువగా ఉండడంతో మాజీ గవర్నర్ తమిళిసైతో ప్రచారం చేయిస్తున్నారు. సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో కూడా ప్రచారం చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సికింద్రాబాద్ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా నటుడు సురేష్ అంబర్‌పేటలో, కుష్బు జూబ్లీహిల్స్‌లో ప్రచారం చేశారు.

మిగిలింది ఐదు రోజులే..

- అయినా ప్రచారంలో ఉత్సాహం కరువు
- కేడర్‌లో తొలగని గందరగోళం
- అగ్రనేతల ప్రచారమే ఆధారం

హైదరాబాద్ సిటీ/రామంతాపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): పోలింగ్‌కు మరో ఏడు రోజులు.. ప్రచారానికున్నది ఐదు రోజులు మాత్రమే. అయినా ప్రజలను కలవడంలో.. వారి మద్దతు కూడగట్టడంలో నాయకుల్లో మునుపటి ఆసక్తి కనిపించడం లేదు. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ప్రచారం నామ్ కే వాస్తేగా సాగుతుండగా.. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో పోల్ మేనేజ్‌మెంట్ విషయంలోనూ అదే నిర్లిప్తత కనబడుతోంది. దీంతో క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లు.. సంఘాలతో సమావేశాలు మినహా ఇంటింటి ప్రచారం, పాదయాత్రలు నామమాత్రంగానే చేశారు. పార్లమెంట్ పరిధి ఎక్కువగా ఉండడం.. ఎండల తీవ్రత ఇందుకు కారణమని సీనియర్ నాయకులు చెబుతున్నారు. ఉన్న సమయాన్ని వినియోగించుకొని ప్రజల్లోకి వెళ్లడంపైనా పార్టీలు, అభ్యర్థులు పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోయారు. సమయం తక్కువగా ఉండడంతో ఈ ఐదు రోజులూ వీలైనంత ఎక్కువగా పార్టీలోని కీలక వ్యక్తులతో ప్రచారం చేయించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

బూత్‌లకు కోత..

పోలింగ్‌కు వారం, పది రోజుల ముందు బూత్‌ల వారీగా స్థానిక కార్యకర్తలకు పోల్ మేనేజ్‌మెంట్ బాధ్యతలు అప్పగిస్తారు. తమ పరిధిలోని ఓటర్లను కలుస్తూ.. పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని కోరాలి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఒక్కో బూత్‌కు పది మంది కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించగా కొన్ని నియోజకవర్గాల్లో ప్రస్తుతం వారి సంఖ్య తగ్గిస్తున్నారు. ఐదారుగురిని ఎంపిక చేస్తున్నారు. దీంతో ఇతరులు అసంతృప్తికి గురవుతున్నారు. గతంలో బూత్‌కు ఖర్చుల నిమిత్తం రూ.10 వేల చొప్పున కొన్ని పార్టీలు మూడు, నాలుగు దఫాలుగా.. ఇంకొన్ని పార్టీలు రోజూ రూ.10 వేలు ఇచ్చేవి. ఇప్పుడా మొత్తాన్ని సగానికి తగ్గించారు.

అంటీముట్టనట్టుగా వారు..

ఒక్కో పార్లమెంట్ పరిధిలో ఓటర్ల సంఖ్యను బట్టి 1800 నుంచి 2500 వరకు పోలింగ్ బూత్‌లున్నాయి. ఒక్కో బూత్ పరిధిలో 1200 నుంచి 1400 మంది ఓటర్లు ఉంటారు. గత గణాంకాలను పరిశీలిస్తే నగరంలో పోలయ్యే ఓట్లు 50 శాతం లోపే. ఈ నేపథ్యంలో ఒక్కో బూత్‌లో 600-800 మంది మాత్రమే ఓటు వేస్తుంటారు. వీరిలో అత్యల్పం వ్యక్తిగత ఆసక్తితో ఓటు వేసే వారుంటే.. స్థానిక నాయకులు పలుమార్లు కలిసి విన్నవిస్తే కొందరు.. ప్రలోభ పర్వాన్ని బట్టి ఇంకొందరు ఓటు హక్కు వినియోగించుకుంటారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో పోల్ మేనేజ్‌మెంట్ విషయంలో ప్రధాన పార్టీలు అంతగా దృష్టి సారించడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రలోభ పర్వాన్ని పక్కన పెడితే.. కనీసం బూత్ పరిధిలో అందుబాటులో ఉన్న ఓటర్లను కలిసి ఓటు వేయమని చెప్పే పరిస్థితి కూడా మెజార్టీ ప్రాంతాల్లో లేదు. ఒక్కో పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. సికింద్రాబాద్, హైదరాబాద్ లోక్‌సభ స్థానాల పరిధిలో 21 లక్షల నుంచి 22 లక్షల ఓటర్లు ఉండగా.. దేశంలోని అతి పెద్దదైన మల్కాజిగిరిలో ఏకంగా 38 లక్షలకు పైగా ఓటర్లున్నారు. వీరందరిని అభ్యర్థులు, కీలక నేతలు కలవడం దాదాపు అసాధ్యం. ఈ నేపథ్యంలో ఎక్కడికక్కడ ప్రచారం నిర్వహించాలి. పలు బస్తీలు, కాలనీల్లో స్థానిక నేతలు కూడా ఓటర్ల వద్దకు వెళ్లడం లేదు. శాసనసభా నియోజకవర్గాల వారీగా పార్టీ సమన్వయకర్తలను నియమించినా పరిస్థితి మారలేదు. బీఆర్ఎస్ విషయానికి వస్తే కొందరు ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు.. బీజేపీ, కాంగ్రెస్‌లకు చెందిన పలువురు కార్పొరేటర్లూ ప్రచారం విషయంలో అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు.

తొలిసారి ఓటు వేస్తున్నారా?

(3వ పేజీ తరువాయి)

ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్ లేదా ఇతర గుర్తింపు పత్రాలను తమ వద్ద ఉండేలా జాగ్రత్త పడటం మంచిది.

పోలింగ్ స్టేషన్ లొకేషన్

తమ పోలింగ్ స్టేషన్ ఎక్కడ ఉందో ముందే తెలుసుకోవడం మంచిది. ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

వాట్సాప్ యూనివర్సిటీలను కాదు..

ఎన్నికలలో సామాజిక మాధ్యమాల హవా కొనసాగుతున్నది. నిరాధార వార్తలు గాలి కంటే వేగంగా ఈ మాధ్యమాలలో విస్తరిస్తున్నాయి. ఆరోపణలకు కొదవే లేదు. దీంతో నిజం ఏదనేది తెలియక గందరగోళంలో పడతాడు ఓటరు. అందుకే విశ్వసనీయ సమాచారం కోసం ఫ్యాక్ట్‌చెక్ వెబ్‌సైట్లు చూడటం మంచిది. రాజకీయాలతో అవగాహన ఉన్నవారితో చర్చించడం వల్ల కొంతమేర అవగాహన కలగవచ్చు.

పోలింగ్ బూత్ ప్రక్రియ

క్యూలో నిల్చోవాలి. లోపలకు వెళ్లిన తర్వాత సంతకాలు చేసి, వేలిపై సిరా గుర్తు పెట్టించుకుని ఈవీఎం మెషీన్‌ల దగ్గరకు వెళ్లిన తరువాత సరైన అభ్యర్థిని ఎంచుకుని ఓటు వేయాలి.

ఓటు వేసిన తర్వాత..

బటన్ నొక్కగానే శబ్దం వచ్చింది కాబట్టి ఓటు వేసేశాం అని సంబర పడిపోకుండా మీరు వేసిన ఓటు సరైన వారికి పడిందా లేదా అన్నది ధ్రువీకరించుకోవడానికి వీవీపాట్ మెషీన్ వైపు చూస్తే ఎంపిక చేసుకున్న అభ్యర్థి గుర్తు కనిపిస్తుంది.








బీజేపీ బహిరంగ సభకు తరలిన నాయకులు


ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు

మండుటెండల్లో ఈటల ప్రచారం ఉధృతం

కుత్బుల్లాపూర్ జోన్‌బృందం, మే 5(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయం దగ్గర పడుతున్నా కొద్దీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా బీజేపీ నాయకులు ప్రచారాన్ని ఉధృతం చేశారు. ఎండలు మండుతుండడంతో ఉదయం 6 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 8 గంటల పాటు బాచుపల్లి నాయకులు కార్యకర్తలతో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహిస్తూ బీజేపీకి ఓటు వేయాలని ప్రజలను కోరారు. బాచుపల్లి ప్రాంతంలో బీజేపీ నాయకులు 1వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు ఆధ్వర్యంలో కేఆర్‌సీఆర్ కాలనీలో ఇంటింటా ప్రచారం చేస్తూ, బీజేపీ కరపత్రాలను పంపిణీ చేసి బీజేపీకి ఓటు వెయ్యాలని ప్రజలను కోరుతున్నారు.

● జీడిమెట్లలో..

జీడిమెట్ల డివిజన్‌లోని ఎంఎస్‌రెడ్డినగర్ ఫేజ్-1, 2 వెంకన్నహిల్స్ ఫేజ్-1, 2లో ఈటల రాజేందర్‌కు మద్దతుగా బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి భరత్‌సింహారెడ్డి, డివిజన్ నాయకులతో కలిసి బీజేపీకి ఓటు వేయాలని కరపత్రాలను ఇంటింటికీ పంచుతూ ప్రచారం చేశారు.

● కొంపల్లిలో ప్రచారం

కొంపల్లి మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులోని ఉమామహేశ్వరి కాలనీలో మున్సిపల్ నాయకులు ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. బీజేపీకి ఓటు వేసి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శివాజీరాజు, సతీష్‌సాగర్, రాజిరెడ్డి, సరితారావు, మాధవి పాల్గొన్నారు.

● బీజేపీ సభకు భారీగా శ్రేణులు

కుత్బుల్లాపూర్‌జోన్‌బృందం: సికింద్రాబాద్ పేరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన బీజేపీ భారీ బహిరంగసభకు నియోజకవర్గం నుంచి బీజేపీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. నిజాంపేట్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపల్, కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాల నుంచి బస్సులు, డీసీఎంల్లో నాయకులు, కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు.

● బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

చంపాపేట: కమలంపువ్వు గుర్తుకు ఓట్లేసి మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి ఓటర్లను కోరారు. చంపాపేట డివిజన్‌లోని నేతాజీనగర్‌కాలనీ, భైరామల్‌గూడ ఓల్డ్ విలేజ్, సీతారాంనగర్ కాలనీలలో ఆదివారం కార్పొరేటర్ ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దేశంలో మోదీ పాలనను ప్రజలు తిరిగి స్వాగతిస్తున్నారని, ఈ కార్యక్రమంలో సుంకరి రమేష్‌గౌడ్, యోగిరాజ్, పాశం శ్రీశైలం, బిహారీ ప్రసాద్, సాయి, విష్ణు, బాలకృష్ణ పాల్గొన్నారు.


కొంపల్లిలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు


చంపాపేట నేతాజీనగర్‌కాలనీలో ప్రచారంలో బీజేపీ నేతలు

'కాసాని' విజయం కోసం కార్యకర్తలు కృషి చేయాలి

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ


సప్తగిరికాలనీలోని క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

వివేకానందనగర్‌కాలనీ, మే 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ విజయం కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని నిర్వహించే రోడ్‌షోకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారని తెలిపారు. శేరిలింగంపల్లి ముఖ్యనాయకులతో ఆదివారం సప్తగిరికాలనీలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

● వీవీనగర్‌లో బూత్‌స్థాయి సమావేశం

వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని బూత్‌స్థాయి కమిటీలు పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ లక్ష్యంగా పని చేయాలని మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు తెలిపారు. వీవీనగర్‌లో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ బూత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంజీవరెడ్డి, గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు, చంద్రకాంత్ పాల్గొన్నారు.

● కేసీఆర్ హయాంలోనే రాష్ట్రాభివృద్ధి

మియాపూర్: మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పై ప్రజల నుంచి వ్యతిరేకత మొదలైందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ఆదివారం మాదాపూర్ డివిజన్ గోకుల్‌ప్లాట్స్‌లో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించి బీఆర్ఎస్‌కు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినినాటి నుంచి చేవెళ్లపార్లమెంట్‌లో బీఆర్ఎస్ గెలుస్తోందని, ఈసారి కూడా కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇస్తామన్నారు. పార్టీ రెండుసార్లు అవకాశం ఇచ్చిన ఇద్దరు నేతలు ఇప్పుడు ఇతర పార్టీల నుంచి పోటీ చేస్తున్నారని ఆ ఇద్దరిని ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే నిత్యావసర సరుకులు, గ్యాస్ ధరలను పెంచి సామాన్యుల బతులను భారంగా మార్చిందని, మత రాజకీయాలు చేసి ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం తప్ప రాష్ట్రానికి చేసింది ఏమీలేదని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలి: సబితారెడ్డి

చేవెళ్ల: రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన అబద్ధాల కాంగ్రెస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించి బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టాలని మాజీ మంత్రి సబితారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం చేవెళ్ల మండల పరిధిలోని కౌకుంట్ల గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదేళ్ల కేసీఆర్ పాలనలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు గుర్తు చేసి బీఆర్ఎస్ పార్టీకి ఓట్లు వేసేవిధంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చేయకుండా మోసం చేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు ఓట్లు వేయాలని సూచించారు. గ్రామంలో మిగిలిపోయిన పనులన్నీ చేస్తామని గ్రామస్తులకు సబితారెడ్డి భరోసా ఇచ్చారు.


గోకుల్ ప్లాట్స్‌లో జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, నాయకులు

రంజిత్‌రెడ్డిని గెలిపించాలి

గచ్చిబౌలి, మే 5 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఆదివారం కొండాపూర్ డివిజన్‌లో పార్టీ నాయకులతో కలిసి కార్పొరేటర్ హమీద్‌పటేల్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రేమ్‌నగర్ ఏ-బ్లాక్, బీ-బ్లాక్‌లో కాంగ్రెస్‌కు ఓట్లు వేసి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.


పార్టీలో చేరుతున్న వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న కార్పొరేటర్ హమీద్‌పటేల్

● రంజిత్‌రెడ్డి గెలుపు కోసం పార్టీలో చేరికలు

రాజేంద్రనగర్: రంజిత్‌రెడ్డిని గెలిపించడానికి యువకులు స్వచ్ఛందంగా ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్నారని మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ అన్నారు. ఆదివారం రాజేంద్రనగర్, ఉప్పర్‌పల్లికి చెందిన వివిధ పార్టీల యువకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, రాజేంద్రనగర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి కస్తూరి నరేందర్ ముదిరాజ్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కోరని బాల్‌రాజ్, పలుగుచెరువు మహేశ్, బొక్క ప్రభాకర్‌రెడ్డి, వి.లలిత్, అనుముల జాన్‌పాల్, చలసాని విష్ణుమూర్తి, రాపోలు సత్తయ్య పాల్గొన్నారు.

● మైలార్‌దేవుపల్లి డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ సామ ఇంద్రపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పద్మశాలిపురం, మధుబన్‌కాలనీ, ఆప్కో కాలనీలలో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు.

ఎల్‌బీనగర్: రేవంత్‌రెడ్డి వంద రోజుల పాలనలో ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేశారని టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్‌లో ప్రచారం చేశారు. ఉపేందర్‌రెడ్డి, రమేష్‌నేత, జ్ఞానేశ్వర్‌యాదవ్, రాజు నాయక్, అక్బర్, కల్యాణ్, డకియార్ నాయక్, షఫీ, పటేల్, సురేష్, అహమద్, శేఖర్, మహ్మద్, జహంగీర్, కిరణ్,లక్ష్మీ, రేణుక, లావణ్య, జయశ్రీ, సరస్వతి, మాధవి, తదితరులు పాల్గొన్నారు.


ఎన్‌టీఆర్‌నగర్‌లో రంజిత్‌రెడ్డికి ఓటు వేయాలని కోరుతున్న దేపభాస్కర్‌రెడ్డి


రాజేంద్రనగర్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న యువకులు

● మీర్‌పేట్ బస్తీల్లో..

సరూర్‌నగర్: మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని 13, 30, 35వ డివిజన్ల పరిధిలోని ప్రశాంత్‌నగర్ ఫేజ్-1, మురళీకృష్ణానగర్, భాగ్యకళానగర్ తదితర బస్తీల్లో ఆదివారం ఎంపీటీసీ మాజీ సభ్యుడు డేరంగుల యాదయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో కలిసి చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి సతీమణి సీతారంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

● రేవంత్ పాలనకు ప్రజలు 'ఫిదా'

రేవంత్‌రెడ్డి పాలనకు ప్రజలు ఫిదా అయ్యారని, ఆయన నాయకత్వాన్ని బలపరుస్తూ వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు.

● ఎంపీ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మీర్‌పేట్ కార్పొరేషన్‌లో మంచి మెజారిటీ రానున్నదని ఆ పార్టీ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మీర్‌పేట్ 10వ డివిజన్‌లోని పలు కాలనీల్లో కార్పొరేటర్ ముద్దా పవన్‌కుమార్‌తో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. చరణ్‌రెడ్డి, నగేశ్, అశోక్, సుదీప్, వంశీ, రవీందర్, సందీప్, రాజేశ్ పాల్గొన్నారు.


మీర్‌పేట్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ పవన్, గోపాల్‌రెడ్డి తదితరులు

కేటీఆర్ రోడ్ షో.. శ్రేణుల్లో ఉత్సాహం

భారీగా తరలివచ్చిన పార్టీ కార్యకర్తలు, మహిళలు

ఎల్‌బీనగర్, మే 5(ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని కర్మన్‌ఘాట్‌లో నిర్వహించిన రోడ్ షోకు పార్టీ శ్రేణులతో పాటు మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. కేటీఆర్‌కు కార్యకర్తలు గజమాలతో స్వాగతం పలికారు. కేటీఆర్ తన ప్రసంగంలో ప్రభుత్వ పథకాల అమలుపై అడిగిన ప్రశ్నలకు మహిళలు స్పందించారు. తమకు పథకాలు రాలేదని గట్టిగా చెప్పారు. కాంగ్రెస్, బీజేపీలపై కేటీఆర్ తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. అంతకుముందు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా 36 పై ఓవర్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిన ఘనత కేటీఆర్‌కే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మన అధినేత కేసీఆర్ తెలంగాణను దేశం గర్వించే విధంగా అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, మాజీ కార్పొరేటర్లు పద్మానాయక్, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, భవానీ ప్రవీణ్‌కుమార్, జిన్నారం విఠల్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలానగర్: తెలంగాణకు గానీ, ప్రజలకు గానీ ఎలాంటి కష్టం వచినా కేసీఆర్ చూస్తూ ఊరుకోడని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ఆదివారం డివిజన్ పరిధిలోని దిల్‌కుష్‌నగర్‌లో ప్రచారం నిర్వహించారు.

● ఓల్డుబోయినపల్లి: రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ఓల్డుబోయినపల్లి బీఆర్ఎస్ నాయకులు డివిజన్‌లో పెద్దఎత్తున్న ప్రచారాన్ని నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మయాదవ్ ఆధ్వర్యంలో ఈద్గాల వద్ద ప్రచారం చేశారు.


రోడ్ షోలో ప్రసంగిస్తున్న కేటీఆర్


కేటీఆర్ రోడ్ షోకు హాజరైన జనం

కాంగ్రెస్‌లో పలువురు చేరిక

హైదర్‌నగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్‌కు చెందిన పలువురు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో గడ్డం రంజిత్‌రెడ్డి సోదరుడు నరేందర్‌రెడ్డి, అల్లుడు రాజేష్‌రెడ్డి సమక్షంలో ఆదర్శ్‌నగర్, దత్తాత్రేయకాలనీ, సుభాష్‌చంద్రబోస్‌నగర్, గణేష్‌నగర్ కాలనీలకు చెందిన సుమారు 500 మంది కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

మియాపూర్: గచ్చిబౌలి డివిజన్ నాయకుడు రాజునాయక్ ఆధ్వర్యంలో సుమారు 200 మంది యువత జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.


ఆల్విన్‌కాలనీలో పార్టీలో చేరిన వారితో వెంకటేష్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, రాజేష్

లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

గాజులరామారం, మే 5(ఆంధ్రజ్యోతి): ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్న గాజులరామారంలోని నల్లగుట్ట లక్ష్మీ నర్సింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆలయ కమిటీ సభ్యులతో కలిసి కాంగ్రెస్ నాయకుడు, కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. ఆలయాల అభివృద్ధికి తనవంతు సహాయ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్య క్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఇంద్రసేనగుప్తా, సభ్యులు బుచ్చిరెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీరాములు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

సరూర్‌నగర్ స్టేడియంలో ఈవీఎంల కమిషనింగ్


సరూర్‌నగర్ స్టేడియంలో ఈవీఎంల కమిషనింగ్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, మే 5(ఆంధ్ర జ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంల కమిషనింగ్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నారు. ఈవీఎంల కమిషనింగ్‌ను ఆదివారం మేడ్చల్-మల్కాజిగిరి అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పరిశీలించారు. అదేవిధంగా స్ట్రాంగ్ రూంను కూడా ఆయన పరిశీలించారు. డీఆర్‌సీ కేంద్రం అయిన ఇండోర్ స్టేడియంలో ఎల్‌బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించిన స్ట్రాంగ్ రూంను పోలీస్ అబ్జర్వర్ డాక్టర్ రామేశ్వర్‌సింగ్ పరిశీలించారు. వారి వెంట అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పంకజ, నోడల్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

● ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు

ఎన్నికల విధులలో పాల్గొంటున్న ఉద్యోగులకు, పోలీసు సిబ్బంది తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు సరూ ర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ నెల 8 వరకు ఈ సెంటర్‌లో ఎన్నికల్లో పాల్గొనే ఎల్‌బీనగర్ సెగ్మెంట్ పరిధిలోని ఉద్యోగులు, పోలీసు సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పంకజ తెలిపారు.

మియాపూర్‌లో మహిళ అదృశ్యం



మియాపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ మహిళ అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వేనగర్‌కాలనీకి చెందిన పల్లపు లక్ష్మి(40) మియాపూర్ మాతృశ్రీనగర్‌లో సహాయ స్వచ్ఛంద సంస్థలో పేషెంట్ కేర్‌టెకర్‌గా పని చేస్తుంది. కాగా ఈనెల 3వ తేదీని ఇంటికి వెళ్లేందుకు మియాపూర్ బస్టాప్ వద్ద బస్సు ఎక్కినట్లు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చింది. కానీ ఇంటికి రాలేదు. ఆమె కోసం అంతటా విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబసభ్యులు ఆదివారం మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుండ్లపోచంపల్లిలో వృద్ధుడు



పేట్‌బషీరాబాద్: చాయ్ తాగేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు తిరిగి రాలేదు. గుండ్లపోచంపల్లి మున్సిపల్‌లో నివాసం ఉంటున్న కొమ్ము పాపయ్య (60) ఇంటి వద్దనే ఉంటున్నాడు. గతనెల 30వ తేదీన రోజు మాదిరిగానే ఉదయం 7 గంటలకు చాయ్ తాగేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు అతడి కోసం బంధువులు, తెలిసిన వారి వద్ద, చుట్టు ప్రక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పాపయ్య కుమారుడు గోపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

18 గంటలు అందుబాటులో ఉండే వ్యక్తి విశ్వేశ్వర్‌రెడ్డి

రాయదుర్గం, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవ చేసేందుకు రోజుకు 18 గంటలు అందుబాటులో ఉండే బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ఆయన సతీమణి డాక్టర్ సంగీతారెడ్డి కోరారు. ఆదివారం కొండాపూర్‌లోని మినర్వ గ్రాండ్ హోటల్‌లో బీజేపీ రంగారెడ్డిజిల్లా కార్యదర్శి ధర్మగారి రవీందర్‌రెడ్డితో కలిసి పలువురు ఐటీ కంపెనీల సీఈవోలు, డీఈవోలు, పలు గేటెడ్ కమ్యూనిటీల వెల్ఫేర్ అసోసియేషన్‌వాసులతో విశ్వేశ్వర్‌రెడ్డి, సంగీతారెడ్డి మాట్లాడుతూ.. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రజలకు సేవ చేసేందుకు ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆమె తెలిపారు.


కార్యక్రమంలో పాల్గొన్న కొండా సంగీతారెడ్డి, నాయకులు

● బీజేపీ చేవెళ్లపార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా రాయదుర్గంలో గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు కృష్ణముదిరాజ్‌తో పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు.

● మియాపూర్: ప్రధానిగా మోదీ చేస్తున్న అభివృద్ధిని చూసి పార్లమెంట్ ఎన్నికల్లో భాజపాకు మదతు ఇవ్వాలని చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సోదరి అనితారెడ్డి అన్నారు. ఆదివారం నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్‌తో కలిసి ప్రచారం చేశారు.

ఇంటి వద్దే ఓటు వేస్తున్న వృద్ధులు, దివ్యాంగులు

పేట్‌బషీరాబాద్, మే 5(ఆంధ్రజ్యోతి): 85 సంవత్సరాలు దాటిన వృద్ధులు 40 శాతం, అంగవైకల్యం కలిగిన ఓటర్లు ఇంటి నుంచి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొంపల్లి పురపాలక సంఘం పరిధిలో మొత్తం 42 మంది వృద్ధులు, దివ్యాంగులు ఓటర్లు ఉన్నారు. ఆదివారం ఇంటి నుంచే ఎన్నికల అధికారుల పర్యవేక్షణలో తమ ఇళ్ల వద్ద ఓటు వేశారు. 42 మంది ఉండగా ఇద్దరు ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోయారు. మరొకరు మృతి చెందారని అధికారులు తెలిపారు. 39 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.


ఓటు హక్కును వినియోగించుకున్న దివ్యాంగులు